ఇఇగా సింహాచలం బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సింహాచలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చింతూరు ఐటిడిఎ ఇఇగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఇఇ మురళి చింతూరు ఐటిడిఎకు బదిలీపై వెళ్లారు. ఇఇ సింహాచలం మాట్లాడుతూ నాడు-నేడు పనులు, రహదారులు, సచివాలయాలు, సిసి రోడ్లు పనులు వేగవంతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.

ఫీ 'జులుం'

కార్పొరేట్ విద్య... అత్యుత్తమ విద్య.... నాణ్యమైన విద్య... అంటూ నిత్యం ప్రయివేట్ విద్యా సంస్థలు ఊదరగొడుతున్న నినాదాలు... పేరేదైనా అంతిమ లక్ష్యం విద్య వ్యాపారమే. జిల్లాలో ఇప్పుడు అక్షరాలా అదే సాగుతోంది. గతంలో విజయనగరం, బొబ్బిలి వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితమైన కార్పొరేట్ పాఠశాలలు నేడు మండల కేంద్రాలకూ విస్తరించి వేళ్లూనుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలకూ సరితూగని కొన్ని పాఠశాలలు అనధికారికంగా టెక్నో, టెక్నో కాన్సెప్ట్, ఐఐటి తదితర పేర్లతో ఫీజుల వసూళ్లలో మాత్రం ముందువరుసలో ఉంటున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒలేవీ జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు.

- ఇష్టారాజ్యంగా వసూలు
- వేళ్లూనుకుంటున్న విద్యా వ్యాపారం
- అమలుకు నోచని జిఒలు
- కానరాని విద్యా ప్రమాణాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడంలో కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాల మాట ఎలా ఉన్నా కరపత్రాలు, బ్రోచర్లు, ప్రకటనల ద్వారా వారు చేస్తున్న ప్రచారానికి విద్యావంతులైన తల్లిదండ్రులూ మోసపోతున్నారంటే, ఆ ప్రచారం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రచార భ్రమలో పడి ప్రభుత్వ పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాలను పక్కన పడేసి, కార్పొరేట్ పాఠశాలల వైపు తాహతుకు మించి పరుగులు తీస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తక్కువే. మెరుగైన ఫలితాలు సాధించని విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అరకొర విద్యార్థులనే ఆయా పాఠశాలలు ప్రచారాలకు వాడుకుంటున్నాయి. ఈ ఆర్భాటాలను ఏ మాత్రమూ పట్టించుకోని తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థల మోజులో పడి జేబులు ఖాళీ చేయించు కుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తూ, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. ఇవే అర్హతలు ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రధానంగా కార్పొరేట్ పాఠశాలల్లో పరిశీలిస్తే ఎక్కడో తప్ప మచ్చుకైనా కనిపించవు.

వ్యాపార వ్యామోహంలో

జూన్ 12నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రయివేటు విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాయి. విద్యార్థుల వేట కోసం మండుటెండలోనూ గడప గడప తొక్కుతున్నాయి. వేసవి సెలవుల్లో అడ్మిషన్లు చేపట్టరాదని నిబంధనలున్నా, వ్యాపార వ్యామోహంలో ఈ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటికితోడు ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 2012 జులై 30న ప్రభుత్వం జిఒ 42ను జారీ చేసింది. దీని ప్రకారం ఆయా విద్యాసంస్థలు కల్పించే సౌకర్యాలను బట్టి అర్బన్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు విద్యార్థుల నుంచి నెలకు రూ.750, ఏడాదికి రూ. తొమ్మిది వేలలోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.650, ఏడాదికి రూ.7,800లోపు వసూలు చేయాలి. హైస్కూల్ విద్యకు అర్బన్ పరిధిలో నెలకు రూ. వెయ్యి. ఏడాదికి రూ.12వేలలోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800 వసూలు చేయాలి. ఈ నిబంధనలు మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులకు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఫీజులకు అసలు పొంతన లేకుండా రెండు మూడు రెట్లు అధిక ఫీజులను వసూలు చేస్తున్నారు.

అమలుకు నోచని జిఒలు

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో సుమారు లక్షా 20వేలమంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో సుమారు 22 వేల మందికి పైగా విద్యార్థులు ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో సుమారు 120 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉంటే, కొన్ని పాఠశాలలు ఐదో తరగతి వరకు అనుమతులుంటే, ఏడో తరగతి వరకు బోధిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలు ఏడో తరగతి వరకు అనుమతులుంటే, 10వ తరగతి వరకు బోధిస్తున్నాయి. ఇలాంటి విద్యాసంస్థల్లోనూ ఫీజులు చుక్కలు చూపిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులే కాక బస్సు, దుస్తులు, బూట్లు, పుస్తకాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితా చాంతాడంత ఉంటుంది. వీటి కోసం వేలకు వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇంత మొత్తంలో విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థులకు అందించాల్సిన కనీస సౌకర్యాలు కూడా చాలా పాఠశాలల్లో లేవు. జిల్లా కేంద్రంలో అనేక ప్రైవేట్ పాఠశాలల భవనాలకు అగ్ని ప్రమాద భద్రత ప్రమాణాలు పాటించకపోవడం గమనార్హం. ఏదైనా ప్రమాదం సంభవిస్తే హడావిడి చేసిన అధికారులు తర్వాత కాలంలో పాఠశాల భవనాల ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేక ఇరుకు గదుల్లో పదుల సంఖ్యలో విద్యార్థులను కూర్చోబెట్టి నానావస్తులకు గురి చేస్తున్నారు. అలాగే మరికొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే సిబ్బంది కనీస విద్యార్హతలు కూడా లేకుండానే పాఠాలు బోధించడం, అటువంటి సిబ్బందిని నియమించుకున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం ఏనాడు జరగక పోవడంతో నేటికీ చాలా పాఠశాలలో కనీస విద్యార్హత లేని ఉపాధ్యాయులు కోకొల్లలు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచితంగా భర్తీ చేయాల్సి ఉండగా, ఈ నిబంధనను నామమాత్రంగానే తప్పితే ఏ ఒక విద్యా సంస్థ తప్పనిసరిగా పాటించకపోవడం, నిబంధనలపై అధికారులు కూడా ఆరా తీయకపోవడంతో నానాటికి ఈ నిబంధన నీరుగారిపోతుంది.

కార్పొరేట్ పాఠశాలల పరిస్థితి అయితే ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ఏడాదికి సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం కనిష్ట స్థాయిలో జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుం టున్నాయి. కుటుంబ పోషణకే జీతాలు చాలడం లేదని, పెంచాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తే వారిని తొలగించిన సందర్భాలు కోకొల్లలు. దీంతో మిగిలిన వారు నోరెత్తలేక ఇచ్చిందే మహా ప్రసాదంగా సరిపెట్టుకొని మిన్నకుంటున్నారు. నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలను మూసివేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని, ఫీజులుంపై విద్యాశాఖాధి కారులు కొరడా ఝుళిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కదులుతుందో, లేదో ఆచరణలో చూడాల్సి ఉంది.

లేను లేనంటూనే ...

టికెట్ రేసులో భంజ్ దేవ్!

- తెరవెనుక పావులు కదుపుతున్న మాజీ ఎమ్మెల్యే
- సీటు కోసం దోబూచులాట

ప్రజాశక్తి -సాలూరు



మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ టిడిపి టికెట్ రేసులో లేనంటూనే తెరవెనుక నుంచి పావులు కదుపుతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన భంజ్‌దేవ్‌కు పార్టీలో బలమైన గ్రూపు ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన వెన్నంటి ఉన్న నాయకులు ఇప్పటికీ ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నారు. నియోజకవర్గ ఇంచార్జిగా గుమ్మిడి సంధ్యారాణి ఉన్నప్పటికీ ఆమె నాయకత్వాన్ని వ్యతిరేకించే నాయకులు దాదాపు అన్ని మండలాల్లోనూ ఉన్నారు. భంజ్‌దేవ్ అనుచరులంతా ఆమె వ్యవహారశైలిని వ్యతిరేకిస్తున్నారు. భంజ్‌దేవ్ అనుచరులను కలుపుకునిపోవడంలో సంధ్యారాణి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. కొద్దినెలల క్రితం వరకు భంజ్‌దేవ్ సంధ్యారాణితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. సంధ్యారాణి నివాసాన్నే పార్టీ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. పాచిపెంట మండలపార్టీ అధ్యక్షుడిగా ఉన్న పిన్నింటి ప్రసాద్ బాబును తప్పించి తన అనుచరుడైన ముఖీ సూర్యనారాయణను నియమించడంతో భంజ్ దేవ్ తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈ పరిణామం జరిగిన తర్వాత నుంచి భంజ్‌దేవ్ సంధ్యారాణి నివాసానికి వెళ్లడం మానేశారు. సంధ్యారాణి వ్యతిరేక గ్రూపు నాయకులు మాత్రం టిడిపి అభ్యర్థిగా భంజ్‌దేవ్‌నే నిలబెట్టాలని, లేకపోతే కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే టిడిపిలో నియోజకవర్గ ఇంచార్జి సంధ్యారాణి గ్రూపు కన్నా భంజ్‌దేవ్ గ్రూపు బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో ఆయన తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చన్నాయుడు, ఇతర అగ్ర నేతలతో ఆయనకు సత్సంబంధాలు వున్నాయి. నాలుగేళ్లుగా నియోజకవర్గ ఇంచార్జి గా వున్న సంధ్యారాణి పార్టీని ఏకతాటిపై నడపడంలో విఫలమయ్యారనే ప్రచారం జరుగుతోంది. తనకుంటూ సొంత గ్రూపును నిర్మించుకోవడంపై సంధ్యారాణి చూపిస్తున్న శ్రద్ధ వ్యతిరేక గ్రూపు నాయకులను అనుకూలంగా మలుచుకోవడంపై చూపించలేదని పార్టీ కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీకి తానే ధీటైన అభ్యర్థి అవుతానని భంజ్ దేవ్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన టికెట్ కోసం చాపకింద నీరులా ప్రయత్నాలు సాగిస్తున్నారనే గుసగుసలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని నియోజకవర్గ ఇంచార్జిల్లో పనితీరు బాగోలేని ఇంఛార్జిలను మార్చాలనే యోచనలో టిడిపి అధిష్టానం ఉన్నట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ సీటు కోసం స్పీడ్ పెంచినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

2014 ఎన్నికల్లో కులధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఆయన పోటీ చేయలేదు. ఆ ఎన్నికల ముందు టిడిపిలో చేరిన సంధ్యారాణికి అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించింది. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా భంజ్‌దేవ్ పోటీ చేసి ఓడిపోయారు. 2004ఎన్నికల్లో మాత్రమే భంజ్‌దేవ్ ప్రస్తుత డిప్యూటీ సీఎం రాజన్నదొరపై తొలిసారి విజయం సాధించారు. ఆ తర్వాత వరుసగా రెండు సార్లు పరాజయం పాలయ్యారు. 2024 ఎన్నికల్లో మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే యోచనలో వున్నట్టు కనిపిస్తోంది.

గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకుల కళాశాల ప్రవేశానికి సీతంపేట బాలుర కళాశాల డిడి బి.నగేష్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వీటిలో సీతంపేట బాలుర కళాశాలకు 288 మంది దరఖాస్తు చేయగా 165 మందిని ఎంపిక చేశారు. సీతంపేట గురుకుల బాలికల కళాశాలలో 507 మంది దరఖాస్తు చేయగా, 140 మందిని ఎంపిక చేశారు, పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో 107 మందికి 40 మందిని ఎంపిక చేశారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేశామని తెలిపారు. ఈ కౌన్సిలింగ్లో జిల్లా మోడల్ కన్వీనర్ ప్రిన్సిపాల్ పి.నాగభూషణరావు, సూర్యకుమారి, రేణుకేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న డిడి నగేష్

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు

సమస్యల పరిష్కారానికి రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు, సిఆర్‌టిలు, భాషా వాలంటీర్లు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఐటిడిఎ వద్ద రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు మాట్లాడుతూ సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పిజిహెచ్‌ఎం, ఎస్ఎలకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు మాట్లాడుతూ భాషా వాలంటీర్లకు పనికి తగిన వేతనం ఇవ్వాలని, రెన్యువల్ చేయాలని, జీవో 3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సిఆర్‌టిల అధ్యక్షులు పడాల నారాయణరావు, భాషా వాలంటీర్ల రాష్ట్ర కార్యదర్శి సవర డొంబురు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.సింహాచలం, బి జయప్రకాష్, ఎ.రామారావు, బి.పకీరు, పి.రమేష్, ఎన్.కృష్ణమూర్తి, ఎ.సింహాచలం, బి.రామయ్య, బి.ధర్మారావు, చిన్నారావు, ఎ.మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ

ప్రజాశక్తి - పార్వతీపురం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో గురువారం వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం మండలం చుక్కవానివలస సంఘటనను వివరించారు. చుక్కవానివలసకు చెందిన ఒక కుటుంబ సభ్యులు మ్యుటేషన్ కోసం మార్చి 6న ఆర్జీనీ సమర్పించారని ఆయన చెప్పారు. మ్యుటేషన్ చేసేందుకు అవసరమైన పత్రాలు ఆ కుటుంబం వద్ద లేవని, వాటిపై సరైన పరిజ్ఞానం లేకపోవడం కూడా ఒక కారణం అని వివరించారు. ఆర్‌డిఒ సూమోటోగా కేసును తీసుకున్నారని, పలుమార్లు విచారణ జరిపి, గ్రామ సభలు నిర్వహించి పుట్టు పూర్వోత్తరాల జాబితాను నెలకొల్పడం జరిగిందని అన్నారు. ఈ వివరాల ఆధారంగా భూమి యజమానిగా ఉన్న వ్యక్తి, పూర్వీకుల మరణ పత్రాలు తయారుచేయడం జరిగిందని, తదనుగుణంగా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసి పక్కా వివరాలతో విజయవంతంగా వన్ 'బి' పట్టాను ప్రస్తుత కుటుంబ సభ్యులకు జారీ చేసినట్లు చెప్పారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్‌ను అభినందించారు.

జిల్లాలో అమ్మ ఒడి పథకం కింద అర్హులెవరూ తప్పిపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రతి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతుందన్నారు. నాడు-నేడు కింద సిమెంట్ సరఫరా జిల్లాకు చేరిందని, పనులు వేగవంతంగా అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత వారం రోజుల్లో రూ.7 కోట్లు ఖర్చు చేశామని, క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించామని ఆయన వివరించారు. వారం రోజుల్లో పనులు పూర్తి కాగలదన్నారు. మరుగుదొడ్లలో నిరంతర నీటి సరఫరా ఉండాలని, ఎక్కడా లీకేజీ ఉండరాదని స్పష్టంగా ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో అదనపు తరగతి గదులు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఆర్జీలకు నాణ్యమైన పరిష్కారం ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖలో మ్యుటేషన్లు, ప్రభుత్వ ఆస్తుల అన్యాక్రాంతంపైన, పట్టణాల్లో తాగు నీటి సరఫరా పట్ల ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎన్. ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ కె.విజయ గౌరి, సిపిఒ పి.వీర్రాజు, జిల్లా సాంఘిక, బిసి సంక్షేమ సాధికారిత అధికారులు ఎం.డి.గయాజుద్దీన్, ఎస్.కృష్ణ, జిల్లా కార్మిక శాఖ అధికారి కె. రామ కష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

జనం చెవుల్లో పూలు పెట్టడానికే టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి -సాలూరు

ఇటీవల జరిగిన మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల చెవుల్లో మరోసారి పూలు పెట్టడానికే దోహదపడుతుందని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు సంబంధించిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని చెప్పారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపారని చెప్పారు. బాబు వస్తే జాబు వస్తుందని ఆనాడు యువతను నమ్మించి మోసగించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి తన కొడుకు లోకేష్‌బాబుకు ఎమ్మెల్సీ ఉద్యోగం ఇప్పించుకున్నారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ యువతను మోసగించడానికి కొత్త కొత్త హామీలతో మేనిఫెస్టో విడుదల చేశారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అరకొర నిరుద్యోగ భృతి ఇచ్చిన చంద్రబాబు నాయుడు రేపు అధికారంలోకి వస్తే రూ.3వేలు చొప్పున ఎలా నిరుద్యోగ బృతి ఇవ్వగలరని ప్రశ్నించారు. 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పడం యువతను మభ్యపెట్టడానికేనని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన 650హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని చెప్పారు. పార్టీ మేనిఫెస్టోను వెబ్ సైట్ నుంచి తొలగించిన ఘనత చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు. టిడిపి మాహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉన్న హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు.

విధుల నిర్వహణ పట్ల అలసత్వం

సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం
కంప్యూటర్ ఆపరేటర్‌కు బదిలీ, ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - సీతానగరం

రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై జిల్లా జలయాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఉపాధి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సక్రమంగా రికార్డుల నిర్వహణ లేకపోవడం, నిర్ణీత సమయంలో రాకపోవడం తదితర అంశాలను పరిశీలించారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ బి.కవితను వీరఘట్టం ఉపాధి హామీ కార్యాలయానికి బదిలీ చేస్తూ అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చినబోగిలి ఫీల్డ్ అసిస్టెంట్ బొట్ట అప్పారావు వారంరోజులుగా పనులు పెట్టకపోవడం, కొత్త పనుల ప్రతిపాదనలు చేయకపోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం గుర్తించి అతడ్ని సస్పెండ్ చేశారు. మండలంలోని బూర్జలో కూడా పనులు సక్రమంగా చేయకపోవడంపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది అందరూ పనితీరును మెరుగుపర్చుకోవాలని, లేకుంటే వేటు తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లోని వేతనదారుల నుంచి డబ్బులు వసూళ్ల గురించి ఆరా తీశారు. తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యాలయ పనితీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సక్రమంగా విధులు నిర్వహించక పోవడం వల్ల వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పీడీ కార్యాయాలనికి వచ్చే సమయానికి ఒక్క కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధులకు హాజరయ్యారు. కొంత సమయం తరువాత సిబ్బంది రావడంతో పీడీఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగితే వారిని తొలగించడం జరుగుతుందన్నారు. పీడీ వెంట కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎపిఒ భాను, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

27 నుంచి ఎఐవైఎఫ్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అఖిలభారత యువజన ఫెడరేషన్ శిక్షణా తరగతులు ఈనెల 27 నుండి 30 వరకు గుంటూరులో జరుగుతాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు కోరారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ఆలోచన ఉందో లేదో స్పష్టమైన వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,35,794 పోస్టులు భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తానని, ప్రతినెలా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి నిరుద్యోగుల ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చి నేడు నిరుద్యోగ సమస్యల గురించి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపి నాయుడు, బిటి నాయుడు, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగభూషణం, జిల్లా కార్యదర్శి. శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

ఘనసరలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -భామిని

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న సబ్‌కలెక్టర్

మండలంలోని ఘనసరలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి కాలనీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ తన బాల్యంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారని, పాఠశాలల్లో కుల వివక్షను భరిస్తూనే విద్యను అభ్యసించారని, ఈ రోజు దేశం పరిపాలనకు మూలమైన రాజ్యాంగం అందించిన మేధావిగా నిలబడ్డారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళలు అన్నీ రంగాల్లో సమాన అవకాశాలు పొందుతున్నారంటే అది ఆయన దూరదృష్టితో రాసిన రాజ్యాంగమని అంబేద్కర్‌ను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, సర్పంచ్ కిల్లారి పాల్గుణరావు, తహశీల్దార్ ఎన్.అప్పారావు, ఎస్ఐ అమ్మన్నారావు, ఉపాధ్యాయులు ఆర్.ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, కె.మిన్నరావు వున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

అభాగ్యులకు అండగా ...

ప్రజాశక్తి - వీరఘట్టం

వివిధ్యుతు, రోడ్డు ప్రమాదాలు, విద్యుత్తు షాక్‌లు తదితరమైన వాటి బారిన పడి కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడంతో అటువంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించి అభాగ్యులకు అండగా స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి నిలుస్తున్నారు. మండలంలోని పాపంపేటకు చెందిన పొట్నూరు సత్యనారాయణ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై రెండు చేతులు కోల్పోయారు. దీంతో ఎమ్మెల్యే స్వగ్రామైన వండవ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.5 లక్షల చెక్కును సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - కురుపాం

కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసే జాబితాలో హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్ ఉండడం పట్ల కురుపాం నియోజకవర్గంలో గల హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు గురువారం స్థానిక సిహెచ్‌సిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ సేవలను గుర్తించి రెగ్యులర్ చేయడం సంతోషకరంగా ఉందని, ఆయనకు మా సిబ్బంది తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో గల హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శశిధర్

చెల్లింపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని శివరాంపురం పంచాయతీ చెల్లింపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అరసాడ పిహెచ్‌సి వైద్యాధికారి శశిధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశామన్నారు. ఇందులో బిపి రోగులు 14, షుగర్ రోగులు 18 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శారద, ఎఎన్ఎం ఎం.బాల, ఆరోగ్య కార్యకర్త కోటి, ఆశా కార్యకర్త శివకుమారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

భూమి సారవంతాన్ని పెంపొందించేందుకు ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు దుక్కి చేసే ముందు పొలాల్లో కలియ దున్నేందుకు అవసరమైన నవధాన్యాల కిట్లను గురువారం మండలంలోని చిన్న బొండపల్లి, బాలగుడబ, బందలుప్పి ఆర్‌బికె పరిధిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయ శాఖకు చెందిన ఆర్‌టిఓ హేమసుందర్ రావు, జిల్లా ప్రాజెక్టు అధికారి షణ్ముఖ రాజు ఆధ్వర్యంలో నవధాన్యాల కిట్లను వ్యవసాయదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ సిద్ధమైన పద్ధతులను వాడుతూ భూసారాన్ని పెంపొందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని అన్నారు. దుక్కికి ముందు నవధాన్యాలు వేయడం వల్ల భూసారం పరిరక్షించుకోవడమే కాకుండా అధిక దిగుబడును సాధించవచ్చని, తద్వారా వ్యవసాయ పెట్టుబడి తగ్గించుకోవచ్చని అన్నారు. రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం కోల్పోవడమే కాకుండా దిగుబడులపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున భూసారాన్ని పరిరక్షించుకునేందుకు నవధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారంటీకి తరలి రావాలి

ప్రజాశక్తి -భామిని

మండల కేంద్రమైన భామినిలో పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించబోయే భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి మండల టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలనిన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, గుమ్మడి సంధ్యారాణి హాజరై, ఇటీవల టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అంశాలు మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికి నీరు, బిసిలకు రక్షణ చట్టం, పూర్ టు రిచ్ పథకాలపై ప్రసంగిస్తారని అన్నారు. భవిష్యత్తుకు పూర్తి స్థాయి టిడిపి విజయానికి చేయాల్సిన అంశాలపై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, టిడిపి మండల కమిటీ సభ్యులు బిడ్డిక ప్రసాద్, గురుబిల్లి లక్ష్మీపతి, కొరాడ రాజేష్ ఉన్నారు.

ఇకెవైసిని పరిశీలించిన జిల్లా ఉపఖజానా అధికారి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని జిల్లా ఉపఖజాన అధికారి ఎ.మన్మథరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఓ కె.శంకరరావు పెన్షనర్లు, ఉద్యోగుల ఇకెవైసి ఎంత శాతం అయిందో అడిగి అనంతరం పరిశీలించి 80 శాతం పూర్తి అవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఇకెవైసి చేయాల్సిన 20 శాతం కూడా పూర్తి చేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది నాగేంద్ర సాయి, అహల్య కుమార్ పాల్గొన్నారు.



ఇకెవైసిని పరిశీలిస్తున్న జిల్లా ఉపఖజానా అధికారి మన్మథరావు

మీ సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం అమ్మవార్ల పండగలో పట్టణ ప్రజలకు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులకు మీరు అందించిన సేవలు వెలకట్టలేనివని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ తాగునీటి విభాగం సిబ్బంది, విద్యుత్ సరఫరా సిబ్బందిని కొనియాడారు. సుదీర్ఘకాలం తర్వాత పట్టణ ప్రజానీకమంతా కలిసి నిర్వహించిన గ్రామదేవతల పండుగ మహెూత్సవంలో విశేషంగా సేవలందించి పట్టణ ప్రజలకు నిరంతరాయంగా మంచినీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం వంటి సేవలను నిర్విరామంగా అందించి పట్టణ ప్రజలకు, లక్షల్లో విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పండగను విజయవంతం చేయడంలో తోడ్పాటు అందించిన పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సేవలను అభినందించారు. గురువారం పురపాలక సంఘం ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే వారి సేవలను కొనియాడుతూ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రముఖులతో కలిసి వారిని ఘనంగా సన్మానించి, సత్కరించి, వారందరికీ వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్యక్రమంలో పాల్గొన్న పలువురిలో ముందుగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణతో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, కార్మికుల సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం మన ప్రాంతాన్ని, మనల్ని మనం గౌరవించుకోవడంతో సమానమని కొనియాడారు. పండుగ నిర్వహణలో అత్యవసర సేవలు అందించడంలో కీలకంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, కార్మికులు అంతా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ చైర్ పర్సన్ కే రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ప్రముఖ డాక్టర్ యాళ్ల వివేక్, ఓం శాంతి అమ్మ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.శ్రీరాములు, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వైసీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బట్టలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పన్ను చెల్లించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాహనదారులు పన్నులు చెల్లించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖ అధికారి జి.మల్లికార్జున్‌రావు హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ 2023 మార్చి 31కి వాహనదారులు పన్నులు చెల్లించి తదుపరి ఆర్థిక సంవత్సరానికి కట్టాల్సిన పన్నులు చెల్లించకుండా వాహనదారులు వాహనాలు నడపడం నేరమన్నారు. అటువంటివారు రోడ్డుపై తమకంట పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు 200శాతం అపరాద రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇటీవల కాలంలో జిల్లాలో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు నడిపిన వ్యక్తులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్ లతో కూడా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. అందుకు పోలీసు, రవాణా శాఖ సంయుక్తగా తనిఖీలు నిర్వహించి మితిమీరిన డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి నడిపిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు.

రైల్వేగేట్లు నుంచి విముక్తి కలిగించండి

ప్రజాశక్తి - కొమరాడ

మూడు రైల్వే గేట్ల నుండి అటు ప్రయాణికులకు ఇటు వాహనదారులకు విముక్తి కలిగించండని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను కోరారు. మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొమరాడ నుండి పార్వతీపురం వరకు 15 కిలోమీటర్ల దూరం ఉండగా ఈ మార్గంలో కోటిపాం, కుమ్మరిగుంట, ఆర్తాం సమీపంలో రైల్వే గేట్లు ఉండటం వల్ల ఈ రహదారిలో మూడు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు రైల్వే గేట్లను దాటుకొని రావాలంటే సుమారు గంట నుండి గంటన్నర సమయం పడుతుందని తెలిపారు. ఇలాంటి సందర్భంలో మూడో రైల్వే లైను పనులు జరుగుతున్న సందర్భంగా మరి కొన్ని నెలల్లో మూడో రైల్వే లైన్ ప్రారంభిస్తే కొమరాడ నుండి పార్వతీపురం ప్రయాణం నరకయాతన అవుతుందన్నారు. కావున రైల్వే అధికారులు వెంటనే స్పందించి రెండు రైల్వే గేట్లు తగ్గించేలా రహదారి నిర్మించి ఒక గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే అటు వాహనదారులకు ఇటు ప్రయాణికులకు చాలా సులభంగా తమ తమ గమ్యాలకు చేరడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. రైల్వే గేట్లు ఎక్కువ సమయం వేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ నిలిచిపోవడం, ఒక్కొక్క సమయంలో కొంతమంది చనిపోయిన పరిస్థితి కూడా ఉన్నాయ న్నారు. వెంటనే రైల్వే అధికారులు చర్యలు తీసుకుని ఈ మూడు రైల్వే గేట్ల నుంచి వాహనదారులకు, ప్రయాణికులకు విముక్తి కలిగించాలని కోరారు.

గేటు పడడంతో నిలిచిపోయిన వాహనాలు

పొంతన లేని మద్దతు ధర

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

వరికి రెట్టింపు మద్దతు ధర ఇచ్చామని బిజెపి చెప్పడం హాస్యాస్పదమైనది అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ బిజెపి 9ఏళ్ల పాలనలో పెట్రోలు, డీజిల్, ఎరువులు పెంపు చూస్తే ఇది మద్దతు ధరే కాదన్నారు. స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కాయన్నారు. మద్దతు రూ.3300 క్వింటా ఇమ్మని ప్రతిపాదన పంపితే కేవలం ఏడు శాతం మాత్రమే పెంచి రైతుల నడ్డి విరిచిందన్నారు. మద్దతు ధరలను చట్టం చేయాలని ఏడాదిన్నర పాటు అన్నదాతలు పోరాడారని, ఇందులో 400 మంది రైతులను బలి తీసుకుందన్నారు. 2023 - 24కి సాధారణ వరికి క్వింటాకు రూ.143 పెంచడాన్ని గొప్పలు చెప్పుకుంటుందన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడిలో సగం కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర పెంచడం కాదు రైతు అందిన ధాన్యం మిల్లు వద్దకు చేరేవరకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని, క్వింటాకు 145 పెరగడం వల్ల మిల్లర్లకే లాభం తప్ప రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. వ్యవసాయంపై పెట్టుబడులు తగ్గించాలంటే ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతాంగం ఐదేళ్లుగా కేంద్రానికి మొరపెట్టినా పట్టించుకోలేదని విమర్శించారు. సాగునీరు సక్రమంగా అందించని పాలకులు నేడు రైతు భరోసా కేంద్రాల్లో దీర్ఘకాలిక వరి వంగడాలను సరఫరా చేస్తున్నారన్నారు. మధ్యకాలిక వరి వంగడాలు సరఫరా చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. మద్దతు ధరను చట్టం చేయాలని ప్రధానమంత్రి హామీ నిలబెట్టుకోలేదన్నారు. దేశానికి ప్రతిష్ట తెచ్చిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను, రైతులను బలి తీసుకున్న కేంద్ర రక్షణ సహాయ మంత్రి అమిత్ మిశ్రాను బర్తరఫ్ చేయకుండా ప్రధాని నిస్సాయతను చాటుకుంటున్నారని విమర్శించారు. ఎంపి, ఎంఎల్ ఎ లు వేతనాన్ని 40 నుంచి 50 శాతం పెంచుకున్న కేంద్రం ఆరుగాలం శ్రమించిన రైతులకు ఏడు శాతం మద్దతు ధర ప్రకటించడం దారుణమన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జానుమల్లువలసలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి గానూ జెజెఎంపి గ్రాంట్ కింద రూ.20 లక్షల అంచనా వ్యయంతో 20,000 లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం శంకుస్థాపన చేశారు. ఇదే గ్రామంలో గతంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి అవసరమైన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూ చేశారు. ఈ మేరకు ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తూ అనుకున్న సమయంలో పూర్తిచేసి గ్రామస్తులకు తాగునీటి సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, స్థానిక సర్పంచ్ యాళ్ల వెంకట నాయుడు, ఎంపిటీసీ సభ్యులు వాకాడ ఉషారాణి, వైసీపీ సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, ఆర్వీ, వై.శివున్నాయుడు, దామోదర్ నాయుడు, వై.పారినాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపిటీసీ సభ్యులు, ఆర్డబ్ల్యూఎస్ డిఇ, ఎఇలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్యాపకుల ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక ఆధ్వర్యంలో అధ్యాపకులు నాలుగు బృందాలుగా ఏర్పడి చినబోగిలి, తామరకండి, బగ్గందొరవలస, బల్లకృష్ణాపురంలో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.రవికుమార్, రామకృష్ణ, రామారావు, నవీన్, వినోద్, అచ్చం నాయుడు, రమేష్ ,మోహన్ రావు, వసంత్ కుమార్, అరుణ్ కుమారి అమ్మాజీ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచలను ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

గర్భిణులకు తనిఖీలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గ్రామ పరిధిలోని గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించడం వల్ల పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందజేయవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన అడ్డూరివలస, ఎంఆర్ నగరం, చినబొండపల్లి గ్రామాల్లో హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది గర్భిణీలకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలను పర్యవేక్షించారు. రికార్డుల్లో నమోదు చేసిన పరీక్షల వివరాలు పరిశీలించి హైరిస్క్ గర్భిణీలకు ఎటువంటి చికిత్స అందజేస్తున్నది వైద్య సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు, చికిత్స అందజేసే కొన్ని పరికరాలు, మందులు వెల్నెస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వీటిని అవసరమైన సందర్భాల్లో వినియోగించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అంగన్వాడీ కేంద్రాల నుంచి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతను గుర్తించిన గర్భిణీలకు ఐరన్ మాత్రలు రెండు పూటలా వేసుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయలక్ష్మి, జయగౌడ్, వైద్య సిబ్బంది ఊర్మిళ, నందిని, పద్మావతి, ఉష, పోలమ్మ, కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఒగా సౌజన్య

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల వ్యవసాయాధికారిగా జక్కువ సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పెద్దపేట విత్తన అభివృద్ధి కేంద్రంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన కె.మన్మథరావు బదిలీ అయ్యారు.

12న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని సాయి నగర్ కాలనీలో గల సత్యసాయి మందిరంలో ఈనెల 12న పాలకొండ మండలం బడ్డుమాసింగి ప్రగతి సేవా సొసైటీ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు వి.విశ్వప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరం నిర్వహించనున్నామని, దీర్ఘకాలిక కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించాలని వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కానూరి శంకరరావు అన్నారు. గురువారం పార్వతీపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల, వయోవద్ధుల హిజ్రాల సంక్షేమ శాఖకు కార్యాలయం ఏర్పాటు చేసి, సంబంధిత సిబ్బందిని నియమించి వికలాంగులకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగులకు ఇచ్చే వివాహ ప్రోత్సాహం, కల్యాణమస్తు పథకంలో విద్యార్హతతో సంబంధం లేకుండా పదో తరగతిని మినహాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, 25ఏళ్ల పైబడిన పైళ్లు కానీ వికలాంగులకు ప్రత్యేకమైన వారుగా ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబాలతో సంబంధంలేకుండా అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వికలాంగుల కుటుంబాల్లో ప్రభుత్వ, ప్రభుత్వ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారని, సిక్స్ స్టెప్ వాలిడేషన్ పేరుతో ఆ కుటుంబంలో ఉన్న పూర్తి స్థాయి వికలాంగుల పింఛన్లు తొలగించడం తగదన్నారు. కావున సిక్స్ స్టెప్ వాలిడేషన్లో వికలాంగులను ప్రత్యేకంగా మినయించి తొలగించిన ఫించన్లు తిరిగి ఇవ్వాలని కోరారు. స్కూటీల విషయంలో సదరం సర్టిఫికెట్లో వైకల్యాన్ని ఆధారంగా చేసుకుని 70శాతం పైబడిన వికలాంగులందరికీ విద్యార్హత సంబంధం లేకుండా మోటరైజేడ్ వికలాంగుల స్కూటీలు మంజూరు చేయాలని, విద్యార్హత పదో తరగతిని ఈ పథకంలో మినహాయించాలని, అలాగే అనేక నిబంధనలు పెట్టి వికలాంగులకు మోటార్ స్కూటీలు లిమిటెడ్‌గా ఇచ్చి వారి మధ్య విభేదాలు రాకుండా అందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటి అధ్యక్షులు సురేష్, సెక్రటరీ శంబంగి భాస్కరరావు, మహిళా అధ్యక్షులు పట్నాల రాధ, కార్యవర్గ సభ్యులు రమేష్, గంగులు, ఇతర మండల సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - జియమ్మవలస

వ్యవసాయ రంగంలో రైతులు అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి పథకాలు అమలు చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కన్నపుదొరవలసలో గడపగడప కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ రైతులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయం అభివృద్ధి చెందితే గ్రామాభివృద్ధి జరుగుతుందనేసదుద్దేశంతో రైతులకు వివిధ పథకాల అమలు చేస్తూ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. రైతు భరోసా అమలు చేస్తూ వ్యవసాయంలో పెట్టుబడుల కోసం ఖరీఫ్‌కు ముందుగానే రైతుల ఖాతాల్లోనికి నిధులు జమ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం శశికళ, వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్ కుమార్, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, స్థానిక ఎంపీటీసీ రెడ్డిరవికుమార్, సర్పంచ్ రెడ్డి అన్నపూర్ణమ్మ, మండలంలోని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చిన్నగోరకాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిన్నగోర కాలనీలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తాను ప్రేమించిన యువకుడు మృతి చెందడంతో మనస్థాపం చెందిన గిరిజన యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ... నెల్లికెక్కువ పంచాయతీ డొంగర కెక్కువకు చెందిన తాడంగి పుష్పవతి (19) ప్రేమ విఫలమైందని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. వారం రోజుల క్రిందట తన బావ పాము కాటుకి గురై మృతి చెందాడు. దీంతో మనస్థాపం చెందిన పుష్పలత తన ఇంటి వద్ద బుధవారం సాయంత్రం గన్నేరు పిక్కలు తినడంతో గుర్తించిన బంధువులు వైద్యం కోసం రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో కురుపాం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పుష్పలత మరణంతో బంధువులు రోధిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాన్ని తొలగిస్తాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో నిర్మించిన గుడిని తొలగిస్తామని ఆర్టీసీ అధికారులు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం గ్రామస్తులు, ఆర్టీసీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో గుడి నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో గుడి కట్టరాదని, దాన్ని తొలగించే హక్కు ప్రభుత్వానికి ఉందన్నారు. గతంలో లాగానే చెట్టు, రచ్చబండ ఉంటాయని చెప్పారు. సర్పంచ్ గౌరీ శంకర్ మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి శ్రద్ధ చూపని అధికారులు గుడి తొలగించేందుకు ఎందుకంత అత్యుత్సాహం చూపిస్తున్నా రని ప్రశ్నించారు. కాంప్లెక్స్‌లో తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా ప్రజలకు అందుబాటులో లేవన్నారు. ఈ విషయమై స్పందించిన ఆర్టీసీ అధికారులు రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో సిఐ సత్యనారాయణ, ఎంపిడిఓ సాల్మన్‌రాజు, తహశీల్దార్ రాములమ్మ, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు ఉన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులు డ్రాయింగ్ పోటీలో పాల్గొన్నారు. చిత్ర లేఖనం పోటీ గ్రంథాలయం నమూనా యోగ మాష్టర్ కె.జనార్ధన్ రావు పర్యవేక్షణలో జరిగింది. శుక్రవారం ఉదయం వ్యాస రచన పోటీ ఉంటుందని, మనం మన గ్రంథాలయంపై వ్యాస రచన పోటీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

జిపిఎస్ పేరిట ఉద్యోగులను మోసగిస్తున్న జగన్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెస్తామంటున్న జిపిఎస్ విధానం ఉద్యోగులకు అన్యాయం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దుపై ఎటువంటి హామీ ఇవ్వని రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. కానీ ఎపి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం జిపిఎస్ వారిపై రుద్ది ఆయా వర్గాలను మోసగిస్తున్నారన్నారు. వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు మాటను కొన్ని వంకర్లుగా తిప్పుతున్నారని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు ఈ మోసాన్ని గ్రహిస్తున్నారని, త్వరలోనే వారికి సరైన జవాబు చెబుతారని అన్నారు.